ఉగాది కథల పోటీలో రూ. 600/- బహుమతి పొందిన కథ

# కర్ణధారి

వెలగా స్వర్ణలత

వయోభారం మనిషిలో వైరాగ్యాన్ని కలిగిస్తుంది. నిండు వృద్ధాప్యం ఓ విధమైన నిర్లిప్తతను పెంచుతుంది. కానీ, అరవై అయిదేళ్లు దాటిన శారదాంబను చూస్తూంటే అదంతా నిజం కాదేమోనన్న అనుమానం ఎవరికైనా వచ్చి తీరుతుంది. జీవితంలోని విభిన్నమైన ప్రతి చిన్న విషయానికి విపరీతంగా ప్రతిస్పందించిపోవడం మొదట్నుంచీ ఆమె స్వభావం.

'పురుషోత్తముడి దగర్నుంచి యివాళైనా ఉత్తరం వస్తుందో రాదో..' వరండాలో వాలు కుర్చీలో చేరగిలబడి అప్పటికో పదిసార్లయినా తన మనస్సులో అలా అనుకుని వుంటుంది శారదాంబ. తుపాకీ పేలిన చప్పుడు విని .. చెట్టు మీది నుండి గుంపుగా ఎగిరిపోయే గువ్వల్లా ... ఉప్పెన గురించి విన్నప్పట్నుంచి ఆమె ఆలోచనలన్నీ తన కొడుకు మీదికే వెళ్లసాగాయి.

ఆ యింటి ఆవరణలో ఉన్న ఓ చెట్టుకొమ్మ చివర కూర్చుని కావ్‌కావ్ మంటూ అరుస్తున్న ఓ కాకి వైపు మెల్లగా తలెత్తి చూసింది శారదాంబ. ఆ కాకి ఆరుపుతో ఆమెలోని ఆశ బలాన్ని పుంజుకొని ఆమె పెదవుల మీద చిరునవ్వు రూపంలో చిందు లేసింది. కాకి వైపే చూడసాగిందామె.


'కాకి కూడా తెగ కూస్తూ వుంది. కనుక యివాళ పురుషోత్తముడే రావడం గానీ... లేదా వాడి దగ్గర్నుంచి ఈ పూట ఉత్తరం అందడం గానీ..ఏదో ఒకటి జరిగితీరాలి' అని తన మనస్సులో అనుకుంది కాకిని కన్నార్పకుండా చూస్తూ శారదాంబ. అదో రకమైన గుడ్డి నమ్మకం. మనిషిలో చచ్చిపోతున్న ఆశకి ఒక్కో సారి గుడ్డి నమ్మకం ప్రాణవాయువును ప్రసాదిస్తుంది.

"అమ్మా!" ఆ పిలుపుతో ఉలిక్కిపడి, తల తిప్పి వీధి గేటువైపు చూసింది శారదాంబ.

జబ్బుతో చావు బ్రతుకుల మధ్య ఊగిసిలాడుతున్న ఒక రోగి .. తనను బ్రతికించడం కోసం వచ్చిన ఓ డాక్టర్ని చూసినట్లు ... పోస్ట్‌మాన్‌ని చూడ్డంతోటే ఆమె గుండెల్లో అంతులేని ఆనందం పురుడు పోసుకుంది. ఆమె ముఖం పూర్తిగా సంతోషంతో వులుముకుపోయింది. తన చేతిలోని ఉత్తరాన్ని ఆమెకి అందించి వెనుదిరిగాడు పోస్ట్‌మాన్ రామ్మూర్తి.

అరనిముషం క్రితం శారదాంబ గుండెల్లో పుట్టిన ఆనందానికి పురిట్లోనే సంధిదెబ్బ తగిలింది. అరటి ఆకు మీద పడ్డ మంచు బిందువులా ఆమె ముఖంలోని సంతోషమంతా సర్రున జారిపోయింది. అది .. తన కొడుకు పురుషోత్తమ శాస్త్రి తనకు రాసిన ఉత్తరం కాదు. దూరపు బంధువెవరో రాసిన ఆ ఉత్తరాన్ని చదవకుండా అలాగే మడతపెట్టి పడేసింది శారదాంబ.

చెట్టుకొమ్మ మీద కూర్చుని యింకా ఎడతెగకుండా అరుస్తూనే వుందా కాకి. అప్పటివరకు ఆ కాకి వైపు ఎంతో ఆశగా చూసిన ఆమె కళ్లు ... యిప్పుడు అసహనంగా చూడసాగాయి. మనిషి ఆశించింది జరిగిపోతే ఏదైనా గురిగల విశ్వాసమే. ఆశించింది జరగని పక్షంలో ప్రతిదీ గుడ్డి నమ్మకమే.



పురుషోత్తముడి దగ్గర్నుంచి యివాళ కూడా ఉత్తరం రాలేదెందుకని? వాడికి వరసగా మూడు రోజులకోసారి మూడు ఉత్తరాలు రాసింది తను. పది రోజులు దాటినా పురుషోత్తముడి దగ్గర్నుంచి తనకు బదులు రాలేదు. బస్సులు, రైళ్ల రాకపోకలు సవ్యంగానే సాగుతున్నాయని, ఉప్పెన ఉపద్రవం లోంచి దాదాపుగా మచిలీపట్నం మళ్లీ తేరుకుంటూ వుందని తాను రేడియోలో వింటూ వుంది.

ఉప్పెనతో మచిలీపట్నం పదిరోజుల క్రితం జలమయమైపోవడం, కొన్ని యిళ్లు కూలిపోవడం, కొంత మంది చనిపోవడం .. ఈ సంఘటనలకు సంబంధించిన ఫోటోల్ని వారం క్రితం అన్ని పేపర్స్‌లోనూ తను చూసింది. ఆ మచిలీపట్నంలో ఉద్యోగం చేసే తన కొడుకు పురుషోత్తముడి సంగతేమిటి?

ఈ ప్రశ్న జగదాంబ బుర్రను కెలికేస్తూ వుంది. మనసును తొలిచేస్తూ వుంది. దానికి తోడు రాకూడని అనుమానం కన్న కడుపును రంపపుకోత పెడుతూ వుంది. మానసికంగా ఆమెను మమకారం కృంగదీస్తూ వుంది. నవమాసాలూ మోసిన కడుపు నానా యాతన పెడుతూ వుంది. బిడ్డ గురించిఅవగింజంత

ఆచూకీ కూడా తెలియని స్థితిలో ఏ తల్లి మాత్రం కొండంత ధైర్యంతో ఉండగలదు?

ఆ ఉప్పెనలో పురుషోత్తముడికెలాంటి ప్రమాదం ముంచుకురాలేదు కదా? వాడు క్షేమంగానే ఉంటాడా? ఒకవేళ ... అదే నిజమైతే వాడి దగ్గర్నుంచి తనకెందుకు ఉత్తరం రావడం లేదు? కనీసం కోడలైనా ఎందుకని బదులు రాయడం లేదు? ఇప్పటి వరకు తను రాసిన మూడు ఉత్తరాలూ వాళ్లకి అందలేదా?

లేక ... వాటిని అందుకోవడానికి అక్కడ వాళ్లు లేరా? ఉప్పెనతో కూలిపోయిన ఎన్నో ఇళ్లలో కొంప దీసి తన కొడుకూ కోడలూ కాపురముంటున్న ఆ అద్దె యిల్లు కూడా...? అంతే శారదాంబ ఆలోచనలు అంతటితో హఠాత్తుగా తెగిపోయాయి. ఆమె ఇక భయంతో ఆలోచించలేకపోయింది.

యినుక తిన్నెల మీద పడిన చినుకుల్లా ఆమె అంతరంగంలోని. ధైర్యం ఇంకిపోసాగింది. గోడపై నున్న బల్లి కూడా సరిగ్గా అప్పుడే అరిచింది. శారదాంబ మనసులోని అనుమానపు బీజం అకస్మాత్తుగా మొలకెత్తి ఏపుగా పెరిగింది. ఆ అనుమానం ఆమెను ఆపాదమస్తకం కంపింప చేసింది.

పురుషోత్తముడు .. తన రక్తంలో రక్తం ... తన ప్రాణంలో ప్రాణం .. నలభై అయిదు సంవత్సరాల తన మమకారం గతించిపోయిన భర్తకు ప్రతిరూపం మిగిలిన సజీవ జ్ఞాపకం. వాడికి .. వాడికేం కాలేదు కదా... వాడికేదైనా అనుకోనిది జరిగితే, తన నవనాడులూ చిట్లిపోతాయి.

తాను ఇలా భయపడుతూ ప్రతి క్షణం నరకయాతన అనుభవించడం కంటే .. తానే మచిలీపట్నం బయల్దేరి వెళితే..? అలా వెళ్లడం తనకి కొత్తేం కాదు. ఏడాదికి మూడుసార్లు ఆ ఊరు వెళ్లి .. కొడుకూ కోడలితో పదిరోజులు గడిపి మళ్లీ తిరిగి వచ్చెయ్యడం తనకు మామూలే.

కానీ, యింతకు ముందు తన పరిస్థితి వేరు. యిప్పుడు వయసు మీద పడింది. పైగా ఇప్పుడు ఆరోగ్యం కూడా బాగుండడం లేదు. దూర ప్రయాణాలు చేసే పరిస్థితిలో తను లేదు. ఈ స్థితిలో తను ఎలా మచిలీపట్నం వెళ్లడం?

అయినా ... శారదాంబ బయల్దేరకుండా వుండలేక పోయింది. తన ఆరోగ్యం బాగాలేకపోయినా .. ఆరు వందల యాభై కిలోమీటర్లు బస్‌లో ప్రయాణం చేసి కొడుకును చూడ్డానికి బాధల్ని లెక్క చెయ్యకుండా ఆమె బయల్దేరింది. అంతే మరి ... వాత్సల్యం వామనావతారమెత్తితే... బాధలన్నీ బలి చక్రవర్తులే.

* * *

'పార్థుడు ఎలా ఉన్నాడో..' రోడ్డుమీద పరధ్యానంగా నడుస్తూ అలా తన మనస్సులో అరడజను సార్లయినా అనుకొని ఉంటాడు పురుషోత్తమశాస్త్రి. పగిలిన పుట్టలోంచి చీమల్లా తన కొడుక్కి సంబంధించిన ఆలోచనా పరంపరలు పురుషోత్తమ శాస్త్రి బుర్రలోంచి పుట్టుకొస్తున్నాయి. నాలుగు రోజుల నుండి అతని మనసు మనసులో లేదు.

అతని కొడుకు పార్థసారధికి యిరవై సంవత్సరాలుంటాయి. ఆ కుర్రాడు హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. అన్ని ఆశలూ కొడుకు మీదే పెట్టుకుని పార్థసారధిని కంటికి రెప్పలా చూసుకుంటూ ఎంతో మురిపెంగా పెంచి పెద్ద చేశాడు పురుషోత్తమశాస్త్రి. కొడుకు కాల్లో ముల్లు విరిగితే .. ముందుగా తానే విలవిలలాడిపోయేవాడతను.

హైదరాబాద్‌లో నాలుగు రోజుల క్రితం మతకలహాలకు సంబంధించి చెలరేగిన మారణకాండ గురించి రోజూ పత్రికల్లో వార్తలు చదువుతున్నాడు పురుషోత్తమశాస్త్రి. రేడియో దగ్గర కూర్చుని వింటున్నాడు. అతని మనసులో ఆరాటం, గుండెల్లో అలజడి. కొడుక్కి సంబంధించిన ఆలోచనలతో అతనికి దాదాపు మతి భ్రమించినట్లుగా ఉంది.

కంటిన్యూగా కర్ఫ్యూ.. కనిపిస్తే కాల్చివేత .. తుపాకీల మోత .. యిదే అక్కడి పరిస్థితి. అడవికీ ఆంధ్రదేశపు రాజధానికీ తేడాలేని స్థితి. మతికీ మానవత్వానికీ శృతి కలవని పరిస్థితి. ఈ స్థితిలో .. తన కొడుకేమైపోయాడో? రక్తపుటేరుల్ని ప్రవహింప చేసే రాజధాని మతోన్మాద నెత్తుటి సూత్రాల మధ్య తన కొడుకు... పార్థుడు .. ఎక్కడున్నాడో? ఎలా ఉన్నాడో?.

సి.ఆర్.పి. దళాల సంచారాలతో భీతిని శ్వాసించే నగరంలో .. వెలుతురుకు భయపడి, అంధకారాన్ని ఆశ్రయించి, ఆకలనేది [illegible] ఒకటుందనే నిజాన్ని మర్చిపోయి .. బిక్కు బిక్కు మని గుండెల్ని చిక్కబట్టుకుని జీవించే అక్కడి మనుషుల మధ్య .. తన పార్థుడు ఎలా ఉన్నాడో? ఏం చేస్తున్నాడో?

"మన పార్థుడి విషయమేదైనా తెల్సిందా?" యింట్లోకి అడుగెట్టిన భర్తను చూసి ఆరాటంతో అడిగింది గాయత్రి. నిజానికి ఆమె ప్రశ్నకి సమాధానం పురుషోత్తమ శాస్త్రి ముఖంలోనే స్పష్టంగా కనిపిస్తున్నా



బట్టలు ఇస్త్రీ చేసేటప్పుడు - చల్లని నీటిని బట్టలపై చిలకరించటం అందరూ చేసే పని...చల్లనీటి బదు లుగా గోరువెచ్చని నీటిని వాడితే...మీ ఇస్త్రీ కార్యక్రమం త్వరగా అయి పోతుంది.

బి.ఎస్. లక్ష్మి

ఆమె తన భర్తను అడక్కుండా వుండలేక పోయింది. భార్య ముఖంలోని ఆరాటానికి నిట్టూర్పుతో బదులు చెప్పి కుర్చీలో చతికిలబడ్డాడు పురుషోత్తమ శాస్త్రి.

"ఏం చెయ్యమంటావ్ గాయత్రీ! ఉప్పెనతో టెలీ కమ్యూనికేషన్స్ దెబ్బతిన్నాయి.పార్థుడి విషయం ఫోన్ చెయించి కనుక్కుందామన్నా వీలు కావడం లేదు. హైదరాబాద్ వెళ్లి వద్దామంటే మధ్యలో ఈ ఉప్పెన పుణ్యమా అని డ్యూటీలు వేశారు. ఓ వేళ వెళ్లినా అక్కడ సిటీ మొత్తం కర్ఫ్యూ. వెళ్తే ప్రమాదమంటున్నారు. ఏం చెయ్యను?" అన్నాడు పురుషోత్తమ శాస్త్రి.

"అన్నట్లు చెప్పడం మరిచాను. ఊరి నుంచి మీ అమ్మగారొచ్చారు" చెప్పింది గాయత్రి.

"ఏమిటి? మా అమ్మ...?"

"గంట క్రితం వచ్చింది అత్తయ్య. కొబ్బరి కాయ కోసం ఇప్పుడే అలా వీధి చివరి కొట్టుకు వెళ్లింది."

"సరిగ్గా ఇప్పుడే తగలడిందా ఆ మహాతల్లి?" పురుషోత్తమ శాస్త్రి ముఖంలో అసహనం.

"అదేంటండీ అలా అంటారు? ఉప్పెనలో మనం ఏమైపోయామోనని అత్తయ్య ఎంతో ఆదుర్దాపడి...."

"హుఁ .. ఉప్పెన .. అప్పుడు కాదు. ఈవిడ రాకతో యిప్పుడొచ్చింది నా బ్రతుక్కి ఉప్పెన."

"ఛ ఊరుకోండి. అత్తయ్య గానీ వింటే బాధ పడుతుంది" అంటూ వీధిగేటు వైపు తొంగి చూసింది గాయత్రి.

"యిప్పుడేం కొంపలు మునిగాయనే హడావుడిగా ఈవిడగారు దయచెయ్యడం?"

"అయ్యో! ఏమిటండీ ఆ మాటలు? యిలాంటి పరిస్థితుల్లో అయినవాళ్లు ఆదుర్దా పడకుండా వుంటారా? చూడ్డానికి యింటికి రాకుండా వుంటారా? అత్తయ్య మూడు ఉత్తరాలు రాసినా బదులు రాయకుండా అదిగో యిదిగో అంటూ నిర్లక్ష్యం చేశారు. మీ నుండి ఉత్తరం అందకపోయేసరికి ఆమె మన ఆచూకీ తెల్సుకొనేందుకు నానా యాతనపడి యిక్కడి కొచ్చింది"

"చూడు గాయత్రీ! ప్రేమానురాగాలకూ కొన్ని పరిమితులుండాలి. పరిమితుల్ని మించిన మోతాదు ఎప్పుడూ ప్రమాదకరమే. ఆరోగ్యం మీది మోజుతో డాక్టర్ యిచ్చిన మందుల్ని మోతాదు మించి వాడితే ఏమౌతుంది? ఆరోగ్యం మరింతగా చెడిపోతుంది. టూమచ్ ఈజ్ వెరీ బ్యాడ్. సంవత్సరానికి మూడు సార్లు నన్ను చూడ్డానికంటూ మా అమ్మ యిక్కడికొచ్చి తిష్ట వేస్తుంది" చాలా విసుగ్గా అన్నాడు పురుషోత్తమ శాస్త్రి.

"ఇక్కడికి రాకుండా ఎలా ఉంటుంది? మీ మీద అత్తయ్యకున్న వాత్సల్యం అలాంటిది"

"ఆ వాత్సల్యానికి ఖర్చెంతో తెలుసా నీకు? సంవత్సరానికి మూడువేల రూపాయలు."

ఆ మాటకు కొయ్యబారిపోయిన గాయత్రి తన భర్త ముఖంలోకి ఆశ్చర్యంగా చూసింది.

"మా అమ్మ వచ్చినప్పుడల్లా ఆమెగారి ఖర్చులకీ, బట్టలకీ, రానుపోను ఛార్జీలకి వెయ్యి వదుల్తుంది నాకు. సంవత్సరానికి ఆవిడ మూడుసార్లొస్తే అనవసరంగా నాకు మూడు వేలు ఖర్చు. అందుకే మా అమ్మను చూసినప్పుడల్లా .. ఓ రెండేళ్ల పాటు ఈవిడ యిక్కడికి రాకుంటే బావుండునన్పిస్తుంది."

గాయత్రి విస్తుపోయింది.

"నన్నడిగితే .. అయినవాళ్ల ప్రేమానురాగాలు ముళ్లకంపల్లాంటి వంటాను. అవి మనల్ని ఆర్థికంగా ముందుకు వెళ్లనీయవు. దారిద్ర్యంలోకి గుంజుతుంటాయి."

తన భర్త నోట్లోంచి వస్తున్న సరికొత్త మాటలు విని గాయత్రి తేరుకోలేకపోయింది.

"కాలం మారింది గాయత్రీ! కాలంతో పాటు ఆర్థిక పరిస్థితులూ మారాయి. ఆఖరికి మానవ జీవన నావను ముందుకు నడిపిస్తున్న సరంగు, డబ్బేనన్న నిజం ఈ ముసలోళ్లకి బోధపడదు" అన్నాడు పురుషోత్తమశాస్త్రి.

"ఇక చాలు ఆపండి. జీవితంలోని విలువల పట్ల, సాంసారిక సంబంధాల పట్ల మీరు ప్రతిపాదిస్తున్న సిద్ధాంతాల గురించి వింటుంటే .. కట్టుకున్న దాన్ని నాకే కంపరం పుడుతోంది" భర్తను మందలించింది గాయత్రి

"అది కాదు గాయత్రీ! నెలనెలా మన పార్థూకి డబ్బులు పంపించడానికే నేనెంతో యిబ్బంది పడుతున్నాను. అలాంటప్పుడు మా అమ్మ సంవత్సరానికి మూడుసార్లు యిక్కడికి రావడం, నన్ను ఇబ్బంది పెట్టడం ఎందుకు చెప్పు? అసలు .. ఇబ్బందికి గురిచేసే మమకారం లేకపోతే నష్టమేమిటంట?"

"చూడండి! పురిటి నొప్పులతో యిబ్బంది పడవలసి వస్తుందని మీరు కడుపులో ఉన్నప్పుడు మీ అమ్మ గర్భస్రావం చేయించుకోలేదే. మిమ్మల్ని పెంచి

పెద్ద చేసి చదువులు చెప్పించి, ఇబ్బంది పడవలసి వస్తుందని .. మీరు పుట్టగానే ఆమె ఏ అనాథ శరణాలయంలోనో మిమ్మల్ని పడెయ్యలేదే."

గాయత్రి అలా వాదించడంతో ఇక పురుషోత్తమ శాస్త్రి నోరు పూర్తిగా మూతపడిపోయింది. అంతలో వీధిగేటు తీసుకొని శారదాంబ రావడంతో ఆ టాపిక్ అంతటితో ముగిసిపోయింది. ఎంతో ఆదరణ అభిమానాలను అభినయిస్తూ పురుషోత్తమ శాస్త్రి తన తల్లితో మాట్లాడాడు. పార్థు గురించి తాను పడుతున్న ఆందోళన వెల్లడించాడు.

వారం రోజులు గడిచిపోయాయి. శారదాంబ తిరిగి ప్రయాణమైంది. మచిలీపట్నం బస్టాండులో ఓ చేతి సంచిని పట్టుకుని .. సిమెంట్ బెంచి మీద, కూర్చుని చుట్టూ వున్న జనాన్ని పరిశీలనగా చూస్తూ వుంది శారదాంబ. ఆమెను బస్సెక్కించడానికి వచ్చిన పురుషోత్తమశాస్త్రి దూరంగా నిలబడి ఓ మిత్రునితో లోకాభిరామాయణం మాట్లాడుతున్నాడు.

"నాయనా దాసూ!" అంటూ కంచంలోని మెతుకుల్ని తింటూ పక్క కుర్రాడి వైపు చూసింది ఓ కబోది స్త్రీ.

"ఏఁవిటమ్మా!" అంటూ ఆ పదేళ్ల కుర్రాడు ఆ కబోది స్త్రీ ముందు నిలబడ్డాడు.

"నాయనా! అడుక్కొచ్చిన అన్నఁవంతా నాముందే పెడితే నీకెట్రా? దా. కూర్చో నువ్వూ తిందువు గానీ"

"నాకొద్దే. నేను కడుపు నిండా తిన్నాను."

"పోరా తప్పుడోడా! నీమాట నేన్నమ్మను. ఏదీ నీ పొట్ట చూద్దాం ఇలారా" అంటూ ఆ కబోది స్త్రీ తన కుడి చేతిని చాచడంతో ఆ కుర్రాడు గతుక్కుమన్నాడు.

వెంటనే తనకేదో ఉపాయం తట్టినట్లు ఆ కుర్రాడు అంటుకుపోయిన డొక్కలతో, ఆకలి నిండిన కడుపుతో ఆగుడ్డిదాని ముందుకు జరిగి .. చట్టుక్కున గట్టిగా ఊపిరి బిగబట్టి గాలిని పీల్చాడు. లోతుకుపోయిన ఆకుర్రాడి పొట్ట ఉబ్బెత్తుగా వచ్చింది. గుడ్డిదాని చేయి ముందుకొచ్చింది.

తన కొడుకు తిన్నాడో లేదోనని ఆ గుడ్డిది .. ఉబ్బెత్తుగా వచ్చిన తన కొడుకు పొట్ట మీద ఓ క్షణ కాలం తడిమి .. పరీక్ష చేసి .. నిజంగానే వాడు కడుపు నిండా తిన్నాడని నిర్ధారించుకుని సంతోష పడిపోయింది. ఆ కుర్రాడు దూరంగా జరిగి బిగ బట్టిన గాలిని వదిలేశాడు.

వాడి పొట్ట యథాతథంగా మళ్లీ వీపుకు అతుక్కుపోయి ఎముకలు బైటపడ్డాయి. వాడి కళ్లలో నీరసం.

కళ్లు లేని తన తల్లి ఆకలిని తీర్చడం కోసం ఆ కుర్రాడు ఆడిన నాటకాన్ని .. తను ఆకలిని భరిస్తూ తన తల్లి కడుపును నింపడానికి వాడు చేసిన అభినయాన్ని కళ్లారా చూసిన శారదాంబ చలించిపోయింది. పదేళ్ల వయస్సున్న ఆ కుర్రాడి ఔన్నత్యం అరవై అయిదేళ్లు దాటిన శారదాంబను కదిపేసింది. ఆమె కళ్లలో హఠాత్తుగా గిర్రున నీళ్లు తిరిగాయి.


యింటింటికీ తిరిగి అడుక్కునే ఈ కుర్రాడికింత ఔన్నత్యాన్ని ఏ యింటి నాగరికత నేర్పింది? దేశానికి సరిహద్దులు కూడా ఉంటాయని తెలియని ఈ అనామకుడికి ఏ దేశపు సరిహద్దుల్ని దాటి వచ్చిన సంస్కృతి యింత జ్ఞానాన్ని కలిగించింది? ఏ పూర్వ జన్మ వాసనా సంస్కారం ఈ కటిక పేదకి కావలసినంత సభ్యతను అలవరించింది?

చరిత్ర లేని జాతుల్లో పుట్టిన ఈ పసి బాలునికి .. ఏ వేద పరిజ్ఞానం .. ఏ శాస్త్రాధ్యయనం .. ఏ విశ్వ విద్యాలయ పుస్తక బాండాగారం యింత సజీవమైన సంస్కారాన్ని యింత అమూల్యమైన మానవతా దృక్పథాన్ని కలిగించాయి?

అంతులేని వైయక్తిక స్వార్థం తోటి, ముక్కలు ముక్కలుగా చీలిపోవడానికి రంగాన్ని సిద్ధం చేసుకొంటూ వున్న అవిభాజ్య హిందూ కుటుంబ వ్యవస్థ ఈ పసివాడి ముందు సిగ్గుతో తలదించుకోవాలి. లోభ గుణంతో కన్న తల్లితండ్రులను కాలదన్నుకొని మమతారాహిత్యంతో మసలే మానవజాతి ఈ కుర్రవాడి ఔన్నత్యానికి దండ ప్రమాణం చెయ్యాలి.

పెనుగాలికి అడవిలోని వెదురుపొదలా ఆ సంఘటనతో శారదాంబ హృదయం ఊగిపోయింది. వెంటనే కూర్చున్న బెంచి మీది నుండి పైకి లేచి మెల్లగా ఆ కుర్రాడిని సమీపించి వాడి ముఖంలోకి తదేకంగా చూడసాగింది శారదాంబ. వాడు భయం భయంగా వెనుకంజ వేశాడు. 'యిలారా బాబూ' అన్నట్లు చేత్తో సంజ్ఞ చేసిందామె.

బెరుకు బెరుకుగా చూస్తూ వాడు శారదాంబ ముందుకొచ్చి నిలబడ్డాడు. భారతీయ ఆర్థిక వ్యవస్థలా వాడి తల వెంట్రుకలు చిందర వందరగా వున్నాయి. నలభైయేళ్ల స్వాతంత్ర్యానికి నామోషీగా మిగిలిన ఓ భావి భారత పౌరుని ఒంటిపై తుంపర్లు తుంపర్లుగా చిరిగిపోయిన బనియన్ మీద శారదాంబ చూపులు కేంద్రీకరింపబడ్డాయి.



పాలు మరగించిన గిన్నెలో చపాతి పిండి కలిపితే చపాతీలు మృదువుగా ఉండటమే కాకుండా గిన్నె జిడ్డు వదలి కడగడం సులువవుతుంది.

* * *

తీపి పదార్థాల్లో పంచదార ఎక్కువయినట్లు అనిపిస్తే చెంచాడు వెనిగర్ కలిపిచూడండి.

* * *

ట్రాన్సిస్టర్, టార్చ్‌లైట్‌లలో బ్యాటరీలను ఉపయోగిచకుండా ఉన్నప్పుడు వాటిని ప్లాస్టిక్ బ్యాగ్‌లో వేసి ఫ్రిజ్‌లో ఉంచండి. ఇవి మన్నికగా ఉంటాయి.

బి.ఎస్. లక్ష్మి

చటుక్కున్న తన చేతి సంచిని తెరిచి అందులో వున్న ఓ పాత శాలువాను తీసి ఆ కుర్రాడి ఒంటి మీద నిండుగా కప్పి .. ఓ పది రూపాయల నోటును వాడి చేతిలో పెట్టి "వెళ్లు బాబూ వెళ్లు. ఏదైనా హోటల్ కెళ్లి కడుపు నిండా అన్నం తిను" అంది శారదాంబ.

ఆమె చేసిన పనికి ఆ కుర్రాడే గాక సరిగ్గా అప్పుడే అక్కడికొచ్చిన పురుషోత్తమ శాస్త్రి కూడా కొయ్యబారిపోయి ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఏమిటమ్మా ఇది?"

"ఏది?"

"ఇప్పుడు నువు చేసిన పని."

"మానవత్వాన్ని సత్కరించడం."

"ఛీ..ఛీ ఈ ముష్టివాడి..."

"పురుషోత్తం! మట్టి అంటుకున్న మాణిక్యాన్ని అసహ్యించుకోం. చచ్చిన ఈగ పడివున్న నైవేద్యాన్ని భక్తి భావంతో భుజించం. ఒరేయ్! ఈ కుర్రాడిలాంటి వాళ్లేరా నీలాంటి స్వార్థపరుల కబంధ హస్తాల్లో యిరుక్కుని కొన ఊపిరితో కొట్టుకుంటూ వున్న విశ్వ మానవత్వానికి జీవ శక్తిని ప్రసాదించగల విధాతలు. నీలాంటి లోభ గుణ సంపన్నులు .. పరమ నీచులూ..."

"అమ్మా! నువ్వు ... నన్ను ... నన్ను ..."

"నిన్నేరా! ప్రేమానురాగాలకు కూడా పరిమితుల్ని నిర్దేశించే నిన్నేరా అంటున్నాను. కన్నతల్లి వాత్సల్యానికి మూడు వేల రూపాయల ఖరీదును కట్టిన నిన్నేరా అంటున్నాను."

నిర్ఘాంతపోయాడు పురుషోత్తమశాస్త్రి.

"నా రాకను అసహ్యించుకుంటూ నువ్వు అసహనంగా వారం క్రితం నీ భార్యతో మాట్లాడిన మాటల్ని మొత్తం నేను విన్నానురా" అంటూ సూటిగా చూసింది శారదాంబ.

తలదించుకున్నాడు పురుషోత్తమ శాస్త్రి. అతని వీపు మీద చొక్కా కింద చీమ ప్రాకుతోంది.

"ఒరేయ్! తల్లి మమకారాన్ని ముళ్ల కంపగా భావించే నీలాంటి కొడుకును కన్న నాకంటే .. అదిగో ఉత్తమ పుత్రుడిని కన్న ఆ కళ్లు లేని కబోది స్త్రీ నిజంగా ఎంతో ధన్యాత్మురాలురా" అంటూ ముష్టి దాన్ని చూపెట్టింది శారదాంబ.

కిందికి దించుకున్న తలను పైకెత్తలేకపోయాడు ముఖం చెల్లక పురుషోత్తమ శాస్త్రి.

"పురుషోత్తం. నీ యింటికొచ్చి నేను వారం పది రోజులు గడవడాన్ని తిప్ప అన్నావు. మరి నువ్వు నా కడుపులో తొమ్మిది నెలలు, పుట్టిన తర్వాత కూడా నా ఒడిలో రెండేళ్లు గడిపావే. అది మాత్రం నీకు తిప్ప అన్పించలేదట్రా?" నిలదీస్తున్నట్లు అడిగింది శారదాంబ.

ఆమె అడిగిన ప్రశ్న పురుషోత్తమ శాస్త్రి బుర్రను భూగోళం చుట్టూ తిప్పేసింది.

"ఒరేయ్! నీలాంటి వాడిని చూసి ఈ ప్రపంచంలో మానవత్వం చచ్చిపోయిందనుకునే వాళ్లుంటే ఉండొచ్చు. కానీ....ప్రపంచంలో మానవత్వం యింకా సజీవంగానే వుందని అదిగో అలాంటి పసివాళ్లను చూసి నేను నమ్ముతున్నాను. మానవ జీవన నావను ముందుకు నడిపించే సరంగు డబ్బు కాదురా. మమకారం. ఈ మమకారమే సరంగై జీవన నావను మానవతా విలువల రేవుకు నడిపిస్తుంది"

పురుషోత్తమశాస్త్రి వీపు మీది నుండి ప్రాకుతూ మెడ మీదికొచ్చింది గండు చీమ.

"చూడు నాయనా! సంవత్సరాంతంలో లాభ నష్టాల్ని చూసుకునే వ్యాపారం కాదు సంసారమంటే. అది మమకార సూత్రంతో అల్లబడిన సాలెగూడు. ఆకలి కంటే అమ్మే ముఖ్యమనుకునే ప్రాచీన భారతీయ సంస్కృతిలో పుట్టి పెరిగిన నువ్వు .. ఆధునిక వ్యాపార నాగరికతా భావజాలాన్ని అలవర్చుకొని అమ్మ చేతికిచ్చే చార్జీ డబ్బుల కోసం బాధపడతావట్రా?

"అమ్మా!"

"చూడు పురుషోత్తం! నిన్ను ఒకే ఒక ప్రశ్న అడుగుతాను సమాధానం చెప్పు. హైదరాబాద్‌లో చదివే నీ కొడుకు ఆ మతకలహాల్లో ఏమైపోయాడోనని నువ్వు ఆందోళన పడడం ఎంత ధర్మమో .. ఉప్పెనలో నా కొడుకేమైపోయాడోనని నేనూ ఆందోళనపడి యిక్కడికి రావడం అంతే ధర్మం కాదంటావా? నీ కొడుకు నీకు ప్రాణమైనట్లు నా కొడుకు నాకు ప్రాణమైతే తప్పా?" శారదాంబ అడిగిన ప్రశ్న పురుషోత్తమ శాస్త్రి గుండెపై కసుక్కున దిగబడింది, అతని మెడ మీద, దిగబడ్డ గండుచీమ కాటులా.